దివ్యవనాలు విశిష్టత

# 108 నీలోత్పల మొక్కలు నాటండి లక్ష పుష్పార్చన చేసిన ఫలం పొందండి

జె. వేణిమాధవి
www.vedicvanas.com



*(గత సంచిక తరువాయి)*

## సరస్వతీ వనం



గౌరీ గుణవతీ గోప్యా, గంధర్వ నగర ప్రియా।
గుణ మాతా గుణాంతస్థా గురురూపా గురుప్రియా ॥

గురు విద్యా గానతుష్టా గాయక ప్రియకారిణీ ।
గాయత్రీ గిరిశారధ్యా గీర్గిరీశ ప్రియంకరీ॥

## నీలోత్పలం - పురాణ ప్రస్తావన

**వాల్మీకి రామాయణం** *(సుందరకాండ 5-57-01,2,3,4)*

హనుమంతుడు లంకకేగుతున్నప్పటి వర్ణన : హనుమంతుడు వాయు వేగంతో అలసట లేనివాడై, అంతంకానరాని ఆకాశం వలె గోచరిస్తున్న సముద్రాన్ని బ్రహ్మాండమైన నౌక వలె దాటుతున్నాడు. ఆ ఆకాశం లాంటి సముద్రం చంద్రకాంతి వల్ల తెల్లగా వుంది. పుష్యమి, శ్రవణ నక్షత్రాలు హంసల వలెను, మేఘాలు కలుపుమొక్కల వలెను, పునర్వసు నక్షత్రం ఒక పెద్ద చేప వలెను, అంగారక గ్రహం పెద్ద మొసలి వలెను అనిపిస్తున్నాయి. ఆ సముద్రంలోని దీవి ఇంద్రుని ఐరావతం గానూ, దానిపై స్వాతి నక్షత్రం హంస మాదిరిగాను, చంద్రకాంతి అలలతో కూడిన చల్లటి నీటి వలె ఉండి, అందులో నాగులు, యక్షులు, గంధర్వులు విరబూసిన పద్మాలు, కలువలుగా వున్నారు.



**కంబ రామాయణం** *(శ్రీ దశరథ మహారాజు రాజ్యం గురించిన వర్ణన)*

వనంలో నాట్యమాడుతున్న నెమలికి దీపాలు పట్టుకున్నట్లున్న పద్మాలు. మృదంగనాదం వంటి శబ్దాలను చేస్తున్న మేఘాలను కళ్ళు విప్పి చూస్తున్న నల్ల కలువలు. చెరువులు, కొలనుల్లోని నీరు మెరుస్తున్న పరదాలు కాగా, భ్రమరాలు తేనెలూరే ఝుంకారనాదాలు చేస్తుండగా, అక్కడ సస్యశ్యామల సంక్రాంతి లక్ష్మి హుందాగా ఆసీనురాలై వున్న ట్లుంది.





నమ్మకమున్నవాని చెంత అన్నీ వుంటాయి. నమ్మకం లేనివాని చెంత అంతా శూన్యమే.



**శ్రీమదాంధ్ర భాగవతం** *(యోగీంద్రుల ధర్మాలను కపిలమహర్షి తన తల్లియైన దేవహూతికి ఉపదేశిస్తున్న సందర్భం)*

అర్థం : శ్రీమన్నారాయణుడు అప్పుడే వికసిస్తున్న పద్మాల రేకుల వంటి అందమైన కన్నులు కలవాడు; సొగసైన శ్రీవత్సం అనే పుట్టు మచ్చ వక్షస్థలాన ఉన్నవాడు.

నీలిమేఘం, నల్లకలువల వంటి శ్యామలఛాయ కలవాడు, తుమ్మెదలకు కనువిందుచేసే వైజయంతికా మాలికలతో విరాజిల్లేవాడు; కౌస్తుభ మణితో శోభించే ముత్యాలహారం కంఠాన ధరించినవాడు, యోగీశ్వరుల హృదయకమలాలకు దగ్గరైనవాడు; ఎల్లవేళలా ప్రసన్న వదనంతో చిరునవ్వు కలిగి, కోటిసూర్యుల తేజస్సుతో ప్రకాశించేవాడు, విలువైన, రమణీయమైన రత్నకుండలాలు, కిరీటం, హారాలు, కంకణాలు, కటకాలు, భుజకీర్తులు, ఉంగరాలు, అందెలు మొదలైన కోటి అలంకారాలతో విలసిల్లేవాడు; కటి ప్రదేశం నందు ఘల్లు ఘల్లుమనే గజ్జెల మొలతాడు కట్టుకుని విరాజిల్లేవాడు – అట్టి శ్రీమన్నారాయణుని సనా సాగ్రమున దృష్టి కేంద్రీకరించి, సుయోగియైనవాడు ధ్యానం చేయాలి అంటూ యోగీంద్రుల ధర్మాలను కపిలమహర్షి తన తల్లి దేవహూతికి ఉపదేశిస్తున్నాడు.



**గోదాదేవి – తిరుప్పావై** (మూడవ పాశురం)

రెండడుగుల్లో ముల్లోకాలకు వ్యాపించి, మూడవ అడుగును బలి చక్రవర్తి శిరస్సుపై వుంచిన ఆ అనంతుడి పాదాలని ఆశ్రయించి, ఆయన పవిత్రనామాన్ని ఏ స్వార్థం లేక లోకాలన్నీ చల్లగా వుండాలన్న నిర్మలమైన కోరిక గల సంకల్పాన్నే వ్రతంగా తలచి స్నానం చేసిన చాలు. దేశంలో ముమ్మారు సకాల వర్షాలు కురిసి కరువు కాటకాలు లేకుండా వుంటుంది.

వాటివల్ల చెరువులు నీటితో నిండి విరబూసిన కమలాలు, పద్మాలు, కలువల కాడల మధ్య నుంచి చేపలు వంటి నీటి జంతువులు తిరుగాడుతుంటే ఆ పువ్వుల్లోని మకరందాన్ని గ్రోలిన భ్రమరాలు, తేనెటీగలు వాటిలో మత్తుగా పొర్లాడుతుంటే, పాడి పశువులు పాలను సమృద్ధిగా ఇవ్వటం చేత ఆ పాత్రలు పొంగిపొరలుతూ వుంటే, దేశం తరగని సిరిసంపదలతో తులతూగుతుంటుంది.











ధనం లేనప్పుడు మన దరికి చేరినవారే మన ఆత్మీయులు.





## విదగ్ధ మాధవ (శ్రీమతి రాధారాణి వర్ణన)

అప్పుడే విరిసిన నీలోత్పల కలువలు రాధాదేవి కళ్ళ అందాన్ని చూసి చిన్నబుచ్చుకున్నాయి. ఆవిడ ముఖసౌందర్యం వనమెల్లా వెల్లివిరిసిన పద్మాలన్నింటిని తలదన్నేలా ఉంది. ఆమె మేనిఛాయ స్వర్ణాభరణాలను బాధించేంత ప్రకాశవంతంగా వుంది. ఈవిధంగా రాధారాణి సౌందర్యం బృందావనంలో వికసించసాగింది.









## మంత్ర మాతృకా పుష్పమాలా స్తవం

*(శ్రీ శంకరాచార్య విరచిత శ్రీ లలితాత్రిపుర సుందరీ స్తవం)*

కలువలు, నీలోత్పలాలు, మల్లెలు, మరువం, బంగారు తామర, జాజులు, సంపంగులు, మాలతీ, పొగడ, దేవకాంచనం, కాగడామల్లెలు మున్నగునవి. మొగలి, ఎర్రగన్నేరు ఇంకా అనేకవిధాలైన పూలతో దండలు చేసి సద్భావనతో నీకు సమర్పించుచున్నాను. వరాల నిచ్చు ఓ తల్లీ! సంతోషంగా స్వీకరించు.



ఇదేవిధంగా ఇంకా అనేక పురాణాల్లో వివిధ సందర్భాల్లో నీలోత్పలం ప్రస్తావన కనిపిస్తుంది. శివపార్వతుల కళ్యాణం సందర్భంలో పార్వతీదేవి తన ఎడమచేతిలో ఈ పుష్పాన్ని ధరించి వుంటుంది.



తిరుమలలోని శ్రీ వేంకటేశ్వరస్వామివారికి కుడిపక్కన శ్రీదేవి, ఎడమపక్కన భూదేవి కొలువై వుంటారు. శ్రీదేవి తన చేతిలో పద్మాన్ని ధరించగా, భూదేవి నీలోత్పలాన్ని ధరిస్తుంది. మన్మథుని బాణం లోని ఐదు పుష్పాల్లో నీలోత్పలం ఒకటి. మిగిలిన నాలుగు పుష్పాలు పద్మం, సీతా అశోకం, మామిడి, మల్లె. భూలోకంలోని ప్రాణుల నిరంతర మనుగడకి అత్యంత కీలకమైంది ప్రత్యుత్పత్తి. ఈ పువ్వులన్నీ కూడా సంతానోత్పత్తికి సహకరించే కోవలోకి వస్తాయని తెలియవస్తోంది.



దేవీ దేవతలిరువురి కళ్ళ వర్ణం లేదా ఆకారం, మేనిఛాయ, చేతియందు, మాలలందు, ఉపమానాలందు నీలోత్పలాలు, కలువల ప్రస్తావనలను చూసాం. ఆయా విశేషాలను వీలైనన్నింటిని వీలైనంత క్లుప్తంగా అర్థవంతంగా మీముందు వుంచడం జరిగింది. వివిధ సందర్భాల్లో నీలోత్పలాల పోలిక ఒకే విధంగా అనిపించినా గానీ, ఆయా దేవతామూర్తుల ననుసరించి దేనికదే ఎంతో విశిష్టత కలిగి వుండటాన్ని గమనించవచ్చు. కేవలం ఈ ఒక్క దివ్యపుష్ప దర్శన మాత్రం చేత మనకు ఇంతమంది దేవీ దేవతలు స్ఫురణకు రావటం వల్ల అప్రయత్నంగా వారి నామ స్మరణ, తద్వారా వారి అనుగ్రహం కలిగే భాగ్యం మనకు కలుగుతుంది.

**ప్రస్తుత పర్యావరణ పరిస్థితుల దృష్ట్యా 108 నీలోత్పలాలతో పూజలు, వ్రతాలు చేసినదానికంటే 108 నీలోత్పల మొక్కలను పుణ్య క్షేత్రాలు లేదా మన దగ్గరలోని దేవాలయాల్లోని అనువైన చోటులో, నాటించటం వల్ల లక్ష పుష్పార్చన చేసినంత ఫలితాన్ని పొందుతారు.**

మరిన్ని నీలోత్పల విశేషాలతో మళ్ళీ కలుద్దాం. (సశేషం)





అజ్ఞానాన్ని తొలగించి, జ్ఞానాన్ని ప్రసాదించేది సత్పురుష సాంగత్యమే.